హత్యకేసును ఛేదించిన పోలీసులు

నిందితులు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

పరిగి టౌన్, మార్చి 20: వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని భర్తను చంపాలని వరుసకు మేనబావతో పథకం రచించి పుల్లుగా మద్యం తాపి హత్య చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పరిగి సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన అనిత(30)ను పూడురు మండల పరిధిలోని మన్నెగూడకు చెందిన సంజయ్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొన్నాళ్లు కాపురం బాగానే ఉన్నా అనితకు వరుసకు బావ అయిన శివారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాళ్లాపూరం గోపాల్ (35)తో వివాహేతర సం బంధం ఏర్పడింది. తమ వివాహేతర సంబంధానికి సంజీవ్ అడ్డొస్తున్నాడని ఎలాగైనా చంపేయాలని పథకం వేసి న గోపాల్ అతని స్నేహితుడు పరిగి మండల పరిధిలోని బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన బల్ల లాలు ప్రసాద్ మృతుని భార్య అనితతో కలిసి మన్నెగూడకు వెళ్ళి కారులో ఎక్కించుకొని కొత్రేపల్లి గ్రామ సమీపంలో ఎన్కేపల్లి వెంచర్ దగ్గర పుల్లుగా మద్యం తాగి తలపై మద్యం బాటిల్, కర్రతో కొట్టి చనిపోయాడన్న నిర్ధారణకు వచ్చి వెళ్లిపోయారు. గుర్తు తెలియని శవాని గుర్తించిన పోలీసులు చన్గోముల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా శివారెడ్డిపల్లికి చెందిన కాళ్లాపూర్ గొపాల్, బొంపల్లికి చెందిన మృతుడి భార్య అనిత, బర్కత్‌పల్లికి చెందిన బల్ల లాలు ప్రసాద్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

బషీరాబాద్, మార్చి 20 : మండల పరిధిలోని కోత్లాపూర్(బి) గ్రామ సర్పంచ్ తల్లి అంత్యక్రియల్లో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రవీందర్ తల్లి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోత్లాపూర్ గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, నాయకులు రాము నాయక్, శివనాయక్ తదితరులు ఉన్నారు.

రేషన్ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

కొండాపూర్, మార్చి 20 : రేషన్ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ అన్నారు. బుధవారం శేరిలింగంపల్లి మండల పరిధిలోని రేషన్ దుకాణంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో అక్రమాలు విస్తు కలిగించేలా ఉన్నాయన్నారు. దుకాణంలో ఉండాల్సిన నిల్వలు మాయం కావడం, 90 క్వింటాళ్లకు పైగా బియ్యం అక్రమంగా తరలించినట్లు నిర్ధారణ అయినట్లు తెలిపారు. శేరిలింగంపల్లిలోని 346 నంబర్ చౌక ధరల పంపిణీ దుకాణంలో ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. కాగా, ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో తారానగర్‌లోని 775 నంబర్ దుకాణాన్ని తాత్కాలికంగా సీజ్ చేసినట్లు గుర్తు చేశారు. అక్రమాలకు పాల్పడే రేషన్ డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, డీలర్‌షిప్‌ను రద్దు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఇన్‌కాయిస్‌లో హిందీభాషపై వర్క్‌షాప్

వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు

దుండిగల్, మార్చి 20: నగరశివారు,నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి,ప్రగతి నగర్ సమీపంలోని ఇన్‌కాయిస్(ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్)లో బుధవారం హిందీభాషపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఇన్‌కాయిస్‌లోని ఆడిటోరియంలో ఇన్‌కాయిస్ డైరెక్టర్ డా.టి.శ్రీనివాస్‌కుమార్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా నగరంలోని సెంట్రల్ రెయిన్‌ఫెడ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డిప్యూటీ డైరెక్టర్ డా.ఎస్ఆర్.యాదవ్ హాజరయ్యా రు. అనంతరం హిందీభాషపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభకనబరిచిన వారికి సర్టిఫికెట్లతోపాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశా రు. కార్యక్రమంలో హిందీ అనువాదకురాలు లక్ష్మీకుమారి, ఇన్‌కాయిస్ సీనియ ర్ ఎగ్జిక్యూటివ్ సంతోష్‌కుమార్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.

గుట్టను తొలిచి... గుడులుగా మలిచి

• లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని నిర్మించిన పశువుల కాపరి పర్మయ్యస్వామి

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి దారి పర్మయ్య స్వామి చెక్కిన గుహ

వికారాబాద్, మార్చి 20: పర్మయ్య స్వామి అనే పశువుల కాపరి తన పశువులను మేపేందుకు ప్రతిరోజు దట్టమైన పులిలొంక అడవుల్లోని గుట్టకు వెళ్లేవాడు. మేకలు మేపుతూ ఒంటరిగా ఉన్నప్పుడు ఆయనకు భయం వేసేది. దానికి తోడు ఎండలు, వర్షాలకు తలదాచుకునేందుకు సౌకర్యం ఉండేది కాదు. దీంతో ఆ గుట్టలను తొలిచి గుహ చేద్దామని సంకల్పించాడు. నాలుగేండ్లల్లో ఎవరి సహాయం లేకుండా గొడ్డలితో గుహగా మలిచాడు. లక్ష్మీ నరసింహాస్వామి ఒక రోజు పర్మయ్యస్వామి కలలో కనిపించి ఎలాగో కొండను తొలిచి గుహను ఏర్పాటు చేశావు. నాకూ కూడా గుడి కట్టు అని ఆజ్ఞాపించినట్లు అనిపించిందంట. అప్పటి నుంచి రాత్రి పగలు అనే తేడా లేకుండా నిర్విరామంగా గుహను తొలిచే పనిలో నిమగ్నమయ్యాడు. ఎంత శ్రమించినా ఎలాంటి కష్టం కనిపించేది కాదట. ఇక అప్పటి నుంచి ఇంటిని వదిలి పూర్తిగా అడవికే అంకితమయ్యాడు. పర్మయ్యస్వామి చేసే పని నాలుగేండ్ల వరకు ఎవరికీ తెలియదు. చాలా కాలం తర్వాత గ్రామస్తులు పర్మయ్యస్వామిని కలిసి విషయం తెలుసుకున్నారు. 1960లో లక్ష్మీనర్సింహా స్వామి విగ్రహాన్ని గ్రామస్తుల సహకారంతో ప్రతిష్ఠింపజేశాడు. అప్పటి నుంచి ప్రతి ఏడాది జాతర, స్వామివారికి కల్యాణోత్సవాలు చేస్తున్నారు.

రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధి

ఈ ఆలయం రెండో యాదగిరి గుట్టగా కూడా పిలుస్తున్నారు. గుహాలయం అద్భుతంగా ఉండడంతో అజంతా గుహలతో పోలుస్తున్నారు. కొండపై లక్ష్మీ నరసింహాస్వామితో పాటు ఆంజనేయస్వామి, భద్రీనాథ్, వేంకటేశ్వర, మల్లికార్జున, నాగేశ్వర స్వామి ఆలయాలున్నాయి. నాలుగు శుక్రవారాలు ఈ కొండకు వచ్చి దర్శించుకుంటే మంచి జరుగుతుందని నమ్మకం.

జాతర కార్యక్రమాలు

ఈ నెల 19న ధ్వజారోహణం, బోనాలు, స్వామివారి పల్లకీ సేవా కార్యక్రమాలు జరిగాయి. 20న రాత్రి 10 గంటలకు స్వామివారి రథోత్సవం, భజన కార్యక్రమాలు జరిగాయి. 21న లక్ష్మీనరసింహా స్వామి కల్యాణోత్సం, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం 5 గంటలకు పెరుగు వసంతంతో

దేవతామూర్తులు

జాతర ముగుస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయానికి ఇలా చేరుకోవాలి

వికారాబాద్ నుంచి సదాశివాపేటకు వెళ్లే దారిలో వెల్‌చాల్ గ్రామానికి చేరుకోవాలి. హైదరాబాద్ నుంచి 60 కిలో మీటర్ల దూరంలో ఉంది. మొరంగపల్లి, సదాశివపేట రైల్వే స్టేషన్ నుంచి వెల్‌చాల్‌కు చేరుకోవచ్చు. వెల్‌చాల్ నుంచి 2 కిలో మీటర్ల దూరంలో పులికొంగ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి చేరుకోవచ్చు.

పిల్లలకు పౌష్టికాహారం తప్పనిసరిగా ఇవ్వాలి

పోషణ్ పక్వాడలో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న పిల్లల తల్లులు

పూడూరు, మార్చి 20 : పిల్లలకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందజేయాలని అంగన్‌వాడీ టీచర్ అరుణదేవి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సోమన్‌గుర్తి నంబర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఏడాది నిండిన పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తెలిపారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పాలు, పండ్లతో పాటు పౌష్టికాహారం అందజేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో పిల్లల తల్లులు తదితరులు ఉన్నారు.

బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కార్మికులకు లేబర్ కార్డులను అందజేస్తున్న రవీందర్, మోత్కూర్ వెంకటేశ్

కులకచర్ల, మార్చి 20 : కార్మికులు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జన్ సహాస్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ రవీందర్, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూర్ వెంకటేశ్ అన్నారు. బుధవారం కులకచర్లలో కార్మికులకు లేబర్‌కార్డులను అందజేశారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు లేబర్ కార్డు పొంది ఉండాలన్నారు. ఈ కార్డు ఉంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ అవకాశం తెల్ల రేషన్ కార్డులు ఉన్న వారందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు భగత్, సాయి కుమార్, సుశీల, రాధ, సునీత, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ ఆస్పత్రిలో ఎక్స్‌రే సేవలు ప్రారంభం

ఎక్స్‌రే పరికరాన్ని ప్రారంభిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిచందన

కొడంగల్, మార్చి 20 : పట్టణంలోని ప్రభుత్వ సీహెచ్‌సీ ఆస్పత్రిలో బుధవారం ఎక్స్‌రే సేవలను ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిచందన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ఎక్స్‌రే సేవలతో పాటు ఆవరణలో నూతనంగా నిర్మించిన మార్చురీ భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. పోస్టుమార్టం కోసం తాండూరు ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేదని, ఇక నుంచి ఇబ్బందులు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సాకెత్‌తో పాటు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల పరిరక్షణ సమితి కమిటీ ఎన్నిక



దోమ మండల కమిటీ అధ్యక్షుడికి నియామక పత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు సుధీర్

దోమ, మార్చి 20 : దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి దోమ మండల కమిటీని ఎన్నుకున్నారు. బుధవారం మండల పరిధిలోని కొత్తపల్లిలో సమితి జిల్లా అధ్యక్షుడు పోతురాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి మండల అధ్యక్షుడిగా కొత్తపల్లికి చెందిన చుక్కయ్య, ఉపాధ్యక్షుడిగా టీ.వెంకటేశంతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ప్రకటించిందని, వాటిలో దివ్యాంగులకు ఎలాంటి పథకాలను ప్రకటించకుండా అన్యాయం చేసిందన్నారు. జిల్లాలో దివ్యాంగుల బ్యాక్ లాక్ ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయిలోని దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూరు గ్రామంలో రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలు తొలగించకుండా రోడ్డేసిన దృశ్యం

స్తంభం ఇలా.. రోడ్డు ఎలా..?

కందుకూరు, మార్చి 20: తిమ్మాపూరు గ్రామం మీదుగా వేస్తున్న బీటీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని గ్రామస్తులు కోరినా.. కాంట్రాక్టర్ పట్టించుకోలేదని మాజీ వార్డు సభ్యులు శ్రీలత యాదగిరి, నల్ల నర్సింహ, మంద రవి, గానుగపేట అశోక్ తదితరులు ఆరోపించారు. గ్రామం మీదుగా ఫార్మాసిటీ వరకు వేస్తున్న రోడ్డు.. తమ గ్రామం నుంచే వెళ్తుందని, ఆ రోడ్డు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత స్తంభాలను తొలగించి, డ్రైనేజీని నిర్మించిన అనంతరం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని వారు తెలిపారు. విద్యుత్ స్తంభాలను తొలగించి, డ్రైనేజీ నిర్మాణం చేపట్టిన తర్వాతే రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. లేనిచో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని వివరించారు. ఈ విషయంలో అధికారులు చొరవతీసుకొని గ్రామస్తులకు సహకరించాలని కోరారు.

భూగర్భ డ్రైనేజీ సమస్యలు లేకుండా చూస్తాం

ఎల్బీనగర్, మార్చి 20: గడ్డిఅన్నారం డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ సమస్యలు లేకుండా చూస్తామని కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం గడ్డిఅన్నారం డివిజన్‌లోని నేతాజీనగర్‌లో కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. కాలనీల్లో మురుగునీరు పారకుండా చూడటంతో పాటు మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, గిరీశ్ గౌడ్, రఘునందన్ జోషి, టింకూ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సైదాబాద్, మార్చి 20 : వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హఫీజ్‌బాబా నగర్ ఫిస్టా బేకరి సమీపంలో నివాసముండే మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ (36) డ్రైవర్, భార్య ఫాతిమా బేగం, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. రెండు కోజుల క్రితం ఫిరోజ్‌ఖాన్ మద్యం సేవించడంతో గొడవపడిన అతడి భార్య శంషాబాద్‌లో ఉండే తన సోదరి ఇంటికి వెళ్లింది. అయితే మంగళవారం సాయంత్రం ఫిరోజ్‌ఖాన్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. భార్య ఫాతిమాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

▪ ఘనంగా చండీహోమం

చండీ హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి-ఉమాదేవి దంపతులు

పరిగి, మార్చి 20 : పరిగి పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం ప్రాతఃకాల పూజలు, హోమాలు, అభిషేకం, చండీహోమం, సాయంత్రం నాలుగు గంటలకు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు జరిగాయి. వేదపండితులు చండీ హోమం చేయించారు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి-ఉమాదేవి దంపతులు చండీహోమంలో పాల్గొన్నారు. అంతకు ముందు లక్ష తులసి అర్చన కార్యక్రమం నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన దత్తాత్రేయ ఆశ్రమం శంకరానందస్వామిని ఎమ్మెల్యే, ఆలయ కమిటీ వారు సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ సిద్దాంతి పార్థసారథి, మాజీ జడ్పీటీసీ ఎస్పీ బాబయ్య, సీనియర్ నాయకులు కొప్పుల రఘుమోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ కార్యదర్శి బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు లాల్‌కృష్ణప్రసాద్, ఎ. కృష్ణ పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలేశ్వర గుప్తా

యాలాల, మార్చి 20 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాలేశ్వర గుప్తా అధ్యక్షతన బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రతి మూడు నెలల కోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. రైతుబీమా చెల్లింపులో తలత్తుతున్న జాప్యం, అన్నాసాగర్‌లో వాటర్ ట్యాంక్ కనెక్షన్ లపై ఎంపీటీసీ కరణం పురుశోత్తమరావు అధికారులను వివరణ కోరారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, వేసవిలో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలీల, డీటీ లక్ష్మణ్ నాయక్, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

కొంషెట్‌పల్లి చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి

మర్పల్లి, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కొంషెట్‌పల్లి చౌరస్తా వద్ద అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. ప్రజలు ఎవరూ కూడా రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్లరాదని సూచించారు. ఆయన వెంట మోమిన్‌పేట సీఐ ఆంజనేయులు, ఎస్సై శ్రీధర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

క్రీడాకారులకు సహకారం..

క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న నాయకుడు వినోద్‌కుమార్

కులకచర్ల, మార్చి 20 : క్రీడాకారులకు తన వంతు సహకారం అందిస్తానని తుపాకుల తండాకు చెందిన నాయకుడు వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తుపాకుల తండాలో యూత్ క్రికెట్ సభ్యులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ గ్రామంలో క్రీడాకారుల అభ్యున్నతి, క్రీడల ప్రోత్సాహానికి కృషి చేస్తానని తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువకులు వెంకటేశ్, దశరథ్, శ్రీహరి, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

పెద్దేముల్, మార్చి 20 : అనుమతులు ఒక ప్రాంతంలో ఉండి ఇసుకను మరో ప్రాంతానికి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామని ఎస్సై గిరి తెలిపారు. మండల పరిధిలోని కందనెల్లి శివారులు బుధవారం సాయంత్రం నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి చర్యల కోసం తహసీల్దార్‌కు అప్పగించామని తెలిపారు.

మరమ్మతులు చేపట్టాలని వినతి

మర్పల్లి, మార్చి 20 : మర్పల్లి నుంచి కొత్లాపూర్ మీదుగా మోమిన్‌పేట వెళ్లే రోడ్డుకు మర్పల్లి వాగు వద్ద ఉన్న మూల మలుపులో గుంతలమయం కావడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. అలాగే రైల్వే స్టేషన్ సమీపంలోని కల్వర్టుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శిలాఫలకం తొలగించాలని ఎంపీడీఓకు ఫిర్యాదు

కందుకూరు, మార్చి 20: కొత్తగూడ గ్రామంలో నిర్మించిన శ్మశాన వాటికకు మాజీ సర్పంచ్ మల్లారెడ్డి తాత, నాయినమ్మల పేర్లను శిలఫలాకంలో పెట్టారని మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తల్లోజు మాధవాచారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖదీర్ బుధవారం ఎంపీడీఓ సరితకు ఫిర్యాదు చేస్తూ... శిలాఫలకాన్ని తొలగించాలని కోరారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, Macchupad కి చెందిన Gollapelli Nagaraju S/o Rajanna, aged 27 years, Occ: Pvt. Employee, R/o Macchupad, Narmetta Mandal, Warangal Dist., **- Applicant/ borrower** నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, షాద్‌నగర్ బ్రాంచ్ గారికి ఇబ్బీ ఆస్తిని తనఖా (Mortgage) పెట్టి అప్పు తీసుకోవటానికి దరఖాస్తు చేసియున్నారు. ఇబ్బీ ఆస్తి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల ఈ క్రింది అడ్రస్సుకు (3) రోజుల లోపల తెలియజేయగలరు. లేని పక్షంలో ఇబ్బీ ఆస్తిపై ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, షాద్‌నగర్ బ్రాంచ్ వారు షెడ్యూల్డ్ ఆస్తిని తనఖా పెట్టుకొని అప్పును మంజూరు చేయుదురు. తరువాత వచ్చిన ఆక్షేపణలు చెల్లనేరవు.

ఆస్తి వివరాలు : Residential house plot No.133 North part an extent 150 Sq.Yards, in Sy.No.968/A, 968/A/1/1, 968/A, 968/2, 981, 981/A, 981/2, 982/A & 982/2, TLP No.25/2023/H, Sree India Township, situated within the limits of Medigadda thanda, Amangal Mandal, R.R.Dist., **హద్దులు : East :** Plot No.134, **West:** Plot No.133 south part, **North:** 33 Ft. Road, **South:**Plot No.128.

K. CHANDRA MOULI, B.Com., LLB
Advocate, New Gunj, Hanuman Nagar,
Mahabubnagar. Cell: 9440330760